# జీవ నియమము

## (The Law of Life)

**పాఠ్యోద్దేశం** : క్రైస్తవుల కొరకు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము చేకూర్చే ప్రయోజనం ఎలా వుంటుందో చూపించుట.

## ఉపోద్ఘాతం

పాపమరణ నియమమును గూర్చి చెప్పటానికి క్రైస్తవ సువార్తికులకు, బోధకులకు చాలా సంగతులు ఉన్నాయి గానీ, జీవము నిచ్చు నియమం అనే అంశం విషయంచాలా మంది మౌనంగా ఉన్నారు. అపొస్తలుడైన పౌలు ఈ మూడు నియమాలకీ ఈ క్రింది లేఖనంలో సమానంగానే ప్రాధాన్యత ఇచ్చాడు.

*క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమమునుండి నన్ను విడిపించెను. ఎట్లనగా ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను.*

*రోమా. 8:2*

మొదటి శతాబ్దంలోని క్రైస్తవులు జీవ నియమమును అర్థం చేసుకొన్నవారేనని అపొస్తలుడైన యోహాను భావించటం జరిగింది. అందుకే, అతడు "అజ్ఞాతిక్రమమే పాపము" అని చెప్పినప్పుడు పాపమును వివరించటానికి స్వేచ్ఛగానే మాట్లాడినాడు (1 యోహాను 3:4). పాపాన్ని మరో విధంగా చెప్పాలంటే, నియమం కాని ప్రతీదీ పాపమే. యోహాను మాట్లాడిన ఆజ్ఞ లేక నియమము ఏది? అది మోషే ధర్మశాస్త్రనియమం కాదని మనమెరుగుదుము. ఎందుకంటే, మోషే ధర్మశాస్త్రాన్ని కాక, యేసుక్రీస్తును అంగీకరించాలని ప్రకటించినందుకే గదా అతడును పేతురును చెరసాలలో వేయబడ్డారు? (అపొ. కార్య. 3:22).

ఈ పాఠంలో మనం జీవ నియమం యొక్క స్వభావాన్ని గుర్తించి, క్రీస్తు నందున్న మన కోసం ఆత్మీయ వాతావరణాన్ని అది ఎలా ఫలభరితం చేస్తుందో చర్చించుదాము. జీవ నియమము అనే అంశం ఈ పాఠ్యక్రమంలో ఇంతకు ముందే రెండుమారులు పరిచయం చేయబడింది. ఆ పాఠాల పునఃశ్చరణ మనకు సహాయకరంగా ఉండవచ్చు. ఒకటవ భాగం, మూడవ పాఠంలో జోయే (zoe) అను గ్రీకు పదం నుండి తర్జుమా చేయబడినట్లుగానే జీవము అనే పదాన్ని నిర్వచించి యుంటిమి. అలాగే, నాలుగవ భాగం, ఆరవ పాఠంలో కూడా జీవ నియమములు యేసుక్రీస్తును గూర్చిన అధ్యయనం లో కనుగొనబడతాయని చూపించియుంటిమి. జీవనియమముతో క్రైస్తవుడు కలిగి యుండిన సంబంధం వల్ల అతనికి ప్రతిఫలముగా లభించు కొన్ని ఆశీర్వాదాల్ని ఈ పాఠంలో చదువుకుందాము.

మానవాళి కోసం అనుగ్రహింపబడిన జీవ నియమానికి సంబంధించి సంపూర్ణమైన పాఠం వ్రాయాలంటే బైబిలు ఎంత పెద్దగా ఉందో అంత పెద్ద పాఠం వ్రాయవలసి వస్తుంది. అయితే, క్రైస్తవుని జీవితాన్ని జీవనియమం ప్రభావితం చేసే **మూడు విషయా లను** మాత్రమే ఈ పాఠంలో వివరించుకుందాం. జీవ నియమం అనేది ఉందని మనం ఎరగటం వల్ల కలిగే ప్రయోజనం మొదటి విషయం. జీవ నియమం ద్వారా ముఖ్యంగా, మన యొక్క మనస్సాక్షి చేసే పనిని ప్రభావితం చేసే భాగంద్వారా మన మనస్సులు క్రమబద్ధం చేయబడటం వల్ల కలిగే విలువరెండవ విషయం. చివరగా,ఈ నియమం యొక్క ఫలము మన ఆత్మీయ పెరుగుదలకు ఎంత ప్రయోజనకరంగా వుంటుందో మనం ఆలోచన చేద్దాము. అయినప్పటికినీ, ఈ మూడు విషయాలను మనం నేర్చుకోటానికి ముందే జీవ నియమం అనే అంశం బైబిలు అంశం అనే వాస్తవాన్ని స్థాపించుదాము.

## పాఠము

రోమా పట్టణంలోని క్రైస్తవులకు పౌలు వ్రాసిన ఉత్తరంలో "జీవము నిచ్చు ఆత్మ యొక్క నియమము" అనే పదజాలాన్ని ప్రయోగించినాడు (రోమా. 8:2). జీవ నియమము అనే మాటకు పర్యాయ పదముగా "దేవుని ధర్మశాస్త్రము" అనే మాటను అతడు రోమా. 8:7లో ప్రయోగించాడు. కొరింథీయులకు పౌలు వ్రాసిన మొదటి ఉత్తరంలో "దేవుని విషయమైన ధర్మశాస్త్రము," "క్రీస్తు విషయమైన ధర్మశాస్త్రము" అనే మాటలు పర్యాయ పదాలుగా చెప్పబడ్డాయి (1 కొరింథీ. 9:21). అలాగే, గలతీయ సంఘములకు పౌలు వ్రాయుచు, "ఒకని భారములనొకడు భరించి, యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి" అని చెప్పాడు (గలతీ. 6:2). క్రైస్తవుల యొక్క హృదయాల లోను మనస్సులలోను వ్రాయబడగలిగే ఒక నియమాన్ని గూర్చి హెబ్రీ గ్రంథకర్త చెప్పాడు (హెబ్రీ. 8:10). పరలోక సంబంధమైన దేవుని సమాజం యొక్క జీవితాన్ని వర్ణించే నియమాన్ని గూర్చి యాకోబు ఈ క్రింది విధంగా చెప్పాడు:

*అయితే **స్వాతంత్ర్యమునిచ్చు** సంపూర్ణమైన **నియమములో** తేరి చూచి నిలకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడుకాక, క్రియను చేయువాడైయుండి తన క్రియలో ధన్యుడగును.*

*యాకోబు 1:25*

*మెట్టుకు నీవలె నీ పొరుగువాని ప్రేమించుమను లేఖనములో ఉన్నట్టి ప్రాముఖ్యమైన యీ **ఆజ్ఞను** మీరు నెరవేర్చినయెడల బాగుగనే ప్రవర్తించువారగుదురు.* *యాకోబు 2:8*

***స్వాతంత్ర్యము ఇచ్చు నియమము** చొప్పున తీర్పు పొందబోవువారికి తగినట్టుగా మాటలాడుడి ఆలాగుననే ప్రవర్తించుడి.* *యాకోబు 2:12*

జీవ నియమం లేక జీవమును గూర్చిన దేవుని యొక్క నియమము లేదా క్రీస్తు యొక్క నియమం ఒక బైబిలు అంశమేననీ ఈ లేఖనాలను బట్టి మనం చూడగలం. నిజానికి, జీవ నియమాన్ని నిర్వచించకుండా పాపాన్ని గుర్తించలేము. ఎందుకంటే "నియమరాహిత్యమే పాపం." జీవ నియమాన్ని మనం తెలుసుకొని, దానిని అనుసరిం చుచుండినందున పాపము నుండియు, పాప ఫలితమైన మరణం నుండియు మనలను అది విడిపిస్తుంది. అందుకే, జీవ నియమం స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణ నియమం అని పిలవబడింది. "అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు గాని అన్నియు చేయ దగినవి కావు" 1 కొరింథీ. 6:12. "అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు గాని అన్నియు క్షేమాభివృద్ధి కలుగజేయువు" 1 కొరింథీ. 10:23.

మోషేకు దేవుడిచ్చిన ధర్మశాస్త్రానికి భిన్నమైన నియమం జీవ నియమం. మొత్తా నికి, అది ఒక విభిన్నమైన తరహాకు చెందినదే. ఈ విషయం అర్థం కాకపోతే క్రైస్తవులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. రోమా ఏడు, ఎనిమిది అధ్యాయాలు పఠిస్తే, మోషే ధర్మశాస్త్రానికి, జీవ నియమానికి ఉండిన వ్యత్యాసం మనకు అర్థ మౌతుంది. మోషే ధర్మశాస్త్రం పాపిని శిక్షించింది. కానీ, పౌలు, "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియులేదు" అని నిర్ధారించినాడు (రోమా. 8:1). క్రీస్తు యేసునందు జీవము నిచ్చే ఆత్మ యొక్క నియమం మనలను శిక్షించదు. జీవ నియమాన్ని గూర్చి సరియైన ఆలోచనలోకి మనం రావాలంటే "నియమము" అనే మాటను **దేశచట్టముగా కాక, ప్రకృతి నియమం** వంటి నియమమని తలంపవలసివున్నది. దేశచట్టాన్ని ఆలోచించనప్పుడు సాధారణంగా మనం శిక్షావిధి మరియు శిక్ష అనే వాటిని జ్ఞాపకం చేసుకుంటాము. రాతి పలకల మీద వ్రాయటానికి దేవుడు మోషేకిచ్చిన ధర్మశాస్త్రం ఎలాంటి కేటగిరీకి చెందిందో అదే కేటగిరీకి దేశ చట్టం చెంది వుంటుంది. నిర్గమ. 20:17; రోమా. 3:19; 7:7-14; 2 కొరింథీ 3:1-11 చూడండి.

ప్రకృతి నియమం ఆదేశాల్ని లేక ఆజ్ఞల్ని జారీ చేయక పోవటమే కాదు, అది మనల్ని శిక్షించదు కూడా. వస్తువుల ఎదుగుదల **స్వభావ దృగ్విషయాన్ని** అది **వర్ణిస్తుంది.** ఉదాహరణకు, ఉష్ణగతి శాస్త్రంలోని మొదటి సూత్రం ఇలా చెబుతుంది. "భౌతికమైందే గానీ, రసాయనికమైందే గానీ ఒక సామాన్య ప్రక్రియలో శక్తి అనేది సృష్టింపబడదు లేదా నాశనం చేయబడదు. కానీ, కేవలం అది ఒక రూపంలో నుండి మరో రూపంలోకి మార్పు చెందుతూ ఉంటుంది." ఈ విధమైన నియమంలో శిక్షించటం లాంటిదేమీ ఉండదు. ఈ నియమమును గూర్చి మనం ఎరుగకపోతే తీవ్రమైన తప్పిదాలు మన వల్ల చేయబడవచ్చు. అయితే, అది మనలను శిక్షించదు. అదే విధంగా ఆదాము నుండి మోషే వరకూ పాపం ఆరోపింపబడలేదు. ఎందుకంటే, మోషే ధర్మశాస్త్రం లాంటి శిక్షించే నియమం ఆ సమయంలో లేదు. అయినను, ఈ కాలంలో మనుష్యులు కొన్ని తీవ్రమైన పొరపాట్లు చేసారు. జీవ నియమమును వారు అతిక్రమించారు. తత్ఫలితమే మరణం (రోమా. 5:12 14).

జీవించు ప్రాణి (PSUCHE)గా ఆదామును దేవుడు సృష్టించినపుడు ఆదాము జీవము (ZOE) కలిగివున్నాడు (కీర్తన 66:9). జీవనియమం యొక్క సూత్రాలలో ఒక సూత్రం మనం దేవుని ఆజ్ఞలను గైకొనటం (యోహాను 12:50). మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును తినరాదని దేవుడు వారికి ఆజ్ఞాపించాడు. **దేవుని ఆజ్ఞకు** అవిధేయుడై నప్పుడు ఆదాము ఈ సూత్రాన్ని మీరాడు. దేవుని ఆజ్ఞలను అనుసరించి నంతకాలం జీవం (ZOE) అని వర్ణింపబడే శ్రేష్ఠ జీవితాన్ని అతడు అనుభవించటం జరిగింది. ఆదాము దేవుని ఆజ్ఞను మీరినప్పుడు ఈ జీవం నాశనం అయ్యింది.

మన యొక్క సహజవాంఛల్ని అత్యంతశ్రేష్ఠమైన రీతిలో సంతృప్తి పరచగలిగే జీవపు మార్గాలలో దేవుని ఆజ్ఞలు మనల్ని నడిపిస్తాయి. నిత్యజీవం అనే మాటలోని జీవం అనేదాని లక్షణాల్ని మనం అభివృద్ధి చేసుకోగలగటానికి పూర్వం మన ప్రాథమిక అవసరాల సంతృప్తి విషయమైన నిరీక్షణను మనం తప్పక కలిగి ఉండాలి. మరో విధంగా చెప్పాలంటే, దేవునితోను మానవులతోను మనం కొనసాగించే వ్యవహారాలు దేవుని ఆజ్ఞల మూలంగానే క్షేమకరమైన మార్గంలో నడిపింపబడతాయి. జీవిత ప్రయాణం సంతృప్తికరంగా వుండినప్పుడే మానవులు ఆరోగ్యవంతమైన ఉద్వేగపై ఖరులను పెంపొందించుకోగలుగుతారు. దేవుని యొక్క ఆజ్ఞలు, ముఖ్యంగా మానవుని ప్రాథమిక అవసరాలతో సంబంధం ఉన్న ఆజ్ఞలను మానవులు అనుసరింపని యెడల ఆరోగ్యవంతమైన వ్యక్తిత్వాన్ని వారు పెంపొందించుకోలేకపోవచ్చు. ప్రవక్తయైన యెషయా చెప్పిన ఉపమానం ఇదే విషయాన్ని యెషయా 5:1-7లో ఉదాహరించు చున్నది. ఇశ్రాయేలు జనాంగం యొక్క ప్రాథమిక అవసరాలు సంతృప్తిపరచబడు నిమిత్తం దేవుడు కొన్ని ఏర్పాట్లు చేసాడు. ఇశ్రాయేలీయులు యధార్థవంతులుగా ఉండాలనే దేవుడు వారి ప్రాథమిక అవసరాల్ని తీర్చాడు. అయితే, వారు అలా ఉండాలని అనుకోలేదు.

దేవుని యొక్క ఆజ్ఞలు మరియు జీవ నియమం అనేవి లేకపోతే మానవులు యుక్తంగా జీవించగలరు అనే నిరీక్షణ ఉండదు. ప్రకృతి నియమాలను గూర్చి కొంతైనా అవగాహనలేకుండా భూమిమీద జీవించటానికి ప్రయత్నించటం, మరియు దేవుని ఆజ్ఞల్ని జీవనియమాన్ని ఎరుగకుండా జీవించటం అనేవి రెండూ సమతుల్యంగా ఉంటాయి. అంటే, ప్రకృతి నియమాలకు సంబంధించి ఇసుమంత అవగాహన లేకుండావుండి భూమి మీద మానవుడు జీవించటం ఎలా వుంటుందో, జీవ నియమం లేకుండా క్రైస్తవుడు ఆత్మీయ జీవితం జీవించటం కూడా అలాగే వుంటుంది. కాబట్టి,దేవుడు అన్ని యుగాల్లోను తన ప్రజలు యుక్తముగా జీవించు నిమిత్తం తన యొక్క నియమాన్ని వారికి బోధించాడు (ఆది. 26:5). మోషే ధర్మశాస్త్రాన్ని దేవుడు చేర్చే సమయంలో జీవ నియమమే మానవాళికి దేవుని ధర్మశాస్త్రం. అంతకు పూర్వం నుండి వుండినదానికే (జీవ నియమానికే) మోషే ధర్మశాస్త్రం చేర్చబడిందని మనం తప్పక గుర్తింపవలసి వుంది (గలతీ. 3:19).

మనకు జీవము (ZOE) కలగటానికీ, అది సమృద్ధిగా కలగటానికి యేసు లోకానికి వచ్చినారు. మనము జీవము (జోయే) పొందునట్లు ఆయన తన ప్రాణమును (PSUCHE) బలిగా పెట్టారు (యోహాను 10:10,11). యేసులో జీవం (జోయే) ఉంది మరియు ఆయనలోని జీవమే మనజీవితాలకి వెలుగు అయ్యింది. అందుచేత, ఈ సందర్భంలో చెప్పబడిన "వెలుగు" యేసు యొక్క జీవితం లేదా బోధలు అనువాటి మూలంగా క్రైస్తవుడు జీవనియమాన్ని నేర్చుకోవటం అనే పరిస్థితిని వివరిస్తుంది అని మనం నిర్ధారించగలం. ఈ పరిస్థితిలో వుండిన వ్యక్తి వెలిగింపబడిన వాడే (ఎఫెసీ. 5:8-14). ఈ క్రింది లేఖనాల్లో అపొస్తలుడైన యోహాను ఈ సంగతులనే ప్రకటించినాడు.

*ఆయనలో జీవముండెను ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను.* యోహాను 1:4.

*మరియు క్రొత్త ఆజ్ఞను మీకు వ్రాయుచున్నాను. చీకటి గతించుచున్నది, సత్యమైన వెలుగు ఇప్పుడు ప్రకాశించుచున్నది గనుక అది ఆయనయందును మీయందును సత్యమే.* యోహాను 2:8.

*నాయందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచియుండకుండునట్లు నేను ఈ లోకమునకు వెలుగుగా వచ్చియున్నాను.* యోహాను 12:46.

*ఆ తీర్పు ఇదే వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి.* యోహాను 3:19

*మరల యేసు నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలిగి యుండునని వారితో చెప్పెను.* యోహాను 8:12.

*వెలుగులో ఉన్నానని చెప్పుకొనుచు, తన సహోదరుని ద్వేషించువాడు ఇప్పటివరకును చీకటిలోనే యున్నాడు.* 1 యోహాను 2:9

జీవ నియమములను వరుసగా వ్రాయటానికి మనం ఈ పాఠంలో ప్రయత్నిం చటం లేదు. కానీ, జోయే అనే గ్రీకు పదం నుండి తర్జుమా చేయబడిన జీవము అనే మాటను వర్ణించు జీవ నియమములను యేసును ఎరుగుట ద్వారానే మనం నేర్చుకోగలుగుతాం. యేసును ఎరుగుట అనేది నిత్య జీవం అనే మాటకు ఇచ్చే నిర్వచనాలలో ఒక నిర్వచనం (యోహాను 17:3). జీవ నియమమునుగూర్చి క్రైస్తవుడు ఎరిగి ఉండటం వల్ల కలిగే ఒక ప్రయోజనం ఏదంటే, మన సమాజంలో జీవమై ఉండని **సాంస్కృతిక లక్షణాల**) నుండి అది మనలను విడిపిస్తుంది. అసహ్యమైన ఈ లక్షణాలే బైబిలు గ్రంథంలో మరణంగా గుర్తింపబడ్డాయి. మరణం అనేది పాపం యొక్క ఫలితం. (1 కొరింథీ. 15:56) ఒక శిశువు జన్మించినపుడు ఒక సమాజంలోనికి ప్రవేశించి అదే సమాజం యొక్క జీవనప్రమాణాలలోనికి సారూప్యం చెందుతాడు. మానవులు శీలం, వ్యక్తిత్వం పెంపొందించు కొనే విధానాలలో ఇదో విధానం. ఏది ఏమైనా, మానవులంతా చెందివుండిన ఆయా సమాజాలలోని జీవన ప్రమాణాలు జీవపులక్షణాలు కాక మరణం కావచ్చు (కొలొస్స. 3:5-8). బైబిలు గ్రంథం లేనివారు లేదా కలిగివుండియు దానిని చదవనివారు మరణాన్ని జీవముగా ఎంచి, మరణాన్ని ఆధారం చేసుకొని పాపం ఎక్కడ ఏలుతుందో ఆలాటి సమాజంలోకి సారూప్యం చెందుతున్నారు (రోమా. 5:21). జీవమును గూర్చి బైబిలు గ్రంథంలో మనం చదువునప్పుడు అంటే, మానవాళి కోసం దేవుడు అను గ్రహించిన జీవ నియమం లేక జీవపు వర్ణన అనుదానిని గూర్చి మనం చదువునప్పుడు లోక సమాజపు జీవన ప్రమాణాల నుండి పరలోక సంబంధమైన సమాజంలోనికి మన మనస్సులు నూతనపరచబడతాయి. **జీవపు సూత్రాలు మరియు మరణపు సూత్రాలు అనే రెంటిలో మనకు కావలసిన వాటిని** ఎన్నుకోగలగటం అనేది జీవ నియమును గూర్చి మనం ఎరిగివుండటం వల్ల కలిగే ప్రయోజనం. ఈ క్రింది లేఖనాల ప్రకారం అపొస్తలుడైన పౌలు మనస్సులో ఉండినది ఈ విషయమే.

*మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి.* రోమా 12:2

*మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు.ఎఫెసీ. 5:8*

క్రైస్తవులు వెలుగుసంబంధుల దేవుని యొక్క చిత్తము ఉత్తమమైనదనీ, అను కూలమైనదనీ నిరూపిస్తారు. మానవుని విషయంలో "దేవునిచిత్తం" మరియు మానవుని గూర్చిన "సత్యం" లాంటి అంశాలు మానవుని కోసం దేవుడిచ్చిన "జీవనియమం"లో నిశ్చయంగా ఇమిడి వున్నాయి. లోకం చేత నిర్వచింపబడిన జీవన ప్రమాణాలు, యేసు ద్వారా నిర్వచింపబడిన జీవన ప్రమాణాలు అంటే జీవపు నియమాలు అను రెంటిలో దేనినైనా ఎన్నుకొనే **అవకాశం** క్రైస్తవులకు ఇవ్వబడింది. మనం వెలిగింపబడిన వారమయ్యాము. ఎందుకంటే, మనల్ని దేవుడు ఎలా రూపొందించాడో అనే సత్యాన్ని దేవుడు మనకు చెప్పాడు, లోక మర్యాదను అను సరింపవలసిన అగత్యం మనకు లేదు. ఎందుకంటే, మనం "నీతియు, యదార్థమైన భక్తియు గలవారమై దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును" ధరించుకొనగలము (ఎఫెసీ. 4:24).

వెలిగింపబడిన క్రైస్తవులు ఎన్నికా స్వాతంత్ర్యమును కలిగియున్నారు. కాబట్టి, జీవ నియమము అంటే, మన రాజు యొక్క చట్టమే మనకు స్వాతంత్ర్యమునిచ్చు నియమం (యాకోబు 2:8,12). అదే సత్యం ఆ సత్యమే మనలను స్వతంత్రులుగా చేస్తుంది. అదేవిధంగా, శక్తికి సంబంధించిన ప్రకృతి నియమం శాస్త్రజ్ఞుల చేత నిర్ణయిం పబడిన తరువాత మానవులు జంతువులను ప్రయాణ సాధనాలుగా ఉపయోగించే విధానం నుండి విడుదలపొందారు. శక్తి అనే దృగ్విషయాన్ని ప్రకృతి నియమం వివరించే రీతిలోనే భూశిలలయందలి ఇంధనాన్ని మనం వినియోగించు కొన్నప్పుడు దాని వలన మనం అనేకమైన ప్రయోజనాలు పొందగలం. వైజ్ఞానిక పరిశోధనలు కొన్ని చేయబడక

పూర్వం శక్తికి సంబంధించిన నియమం మానవులకు తెలియక పోయినను భూశిలల యందలి ఇంధనాన్ని మనం కలిగియుంటిమి. మరో విధంగా చెప్పాలంటే, శక్తి అనే దృగ్విషయానికి సంబంధించి ఆచరణయోగ్యమైన వివరణ మనకు లేకపోయింది. తత్ఫలితంగానే మానవులు కాలి నడకన వెళ్లేవారు లేక ఏదైనా జంతువుపై వెళ్ళేవారు.

జీవమును గూర్చిన మన జ్ఞానం వల్ల కలిగే మరో ప్రయోజనం ఏదంటే, **వ్యక్తిగత మైనవేగానీ అనువంశికమైనవేగానీ మనం కలిగివున్న లోపాల** నుండి అది మనలను విడిపిస్తుంది. మరో విధంగా చెప్పాలంటే, జీవమును గూర్చిన సత్యాన్ని ఎరుగని మనుష్యులు తమ జీవితాలను తామే స్వయంగా దిద్దుకోవలసివుందని తలంచే అవకాశంవుంది. మానవుల శక్తి సామర్థ్యాలను గూర్చిన వర్ణన యేసు క్రీస్తేనని వారు గుర్తించరు (కొలొస్స. 3:4). దేవుడు మానవుణ్ణి సృష్టించిన విధం యేసువలె పెంపొంద టానికి మనకు సహాయం చేస్తుంది. క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమానికి మనలను మనం అన్వయించుకొన్నప్పుడు యేసు యొక్క సారూప్యంలోకి మనం మార్పుచెందుతాము (రోమా 8:2,29). దేవుడు ఏర్పాటు చేసుకొన్న ఎవరోకొందరికే ఇది సంభవిస్తుందని గానీ, లేదా మానవులందరిలోను ఉండిన గుణం ఇదే అని గానీ మనం తలంచ రాదు. మానవులందరిలోను శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. అయితే జీవ నియమమును గూర్చి మనం ఎరిగినవారమై జీవ ఫలమును పొంది ఆనందంగా ఉండటానికి దానిని మనం మనజీవితాలకి అన్వయించుకోవాలి (గలతీ. 5:22,23). వ్యవసాయదారుల విషయంలోను ఇదే జరుగుతుంది గదా! విత్తనానికి సంబంధించిన ప్రకృతినియమానికి అతని చేతిలోవున్న విత్తనాన్ని అన్వయింప చేయనిదే అది మొలకెత్తటానికి శక్తి దానిలో వుండదు. వ్యవసాయదారుడు ప్రకృతి నియమాలను యుక్తంగా అన్వయించు కొంటే, విత్తనాలు తమజాతి పంటను పండిస్తాయి.

దేవుని కుమారులుగా పంటపండిచాలనే మానవుల్ని దేవుడు సృష్టించాడు. మనలోని ప్రతి ఒక్కరిలోను శక్తిసామర్థ్యాలు వున్నాయి. అయితే, మన విషయంలోను వ్యవసాయదారుని విషయం లోను ఒక వ్యత్యాసముంది. అదేమంటే, వ్యవసాయ దారుని యొక్కయు, విత్తనం యొక్కయు పాత్రలను మనమే నిర్వహించుకోవాలి. మన జీవితాలకు సంబంధించిన నియమాన్ని మనమే కనుగోవాలి, ఆ మీదట ఆ నియమానికి మనలను మనం అన్వయించుకోవాలి. మన యొక్క జీవపుశక్తిని సాధించాలంటే జీవాధిపతియైన యేసును మనం కనుగోవాలి. (అపొ. కార్య. 3:15). దేవుని గూర్చిన సత్యాన్ని అడ్డగించినవారు జీవితానికి సంబంధించిన నియమాన్ని గూర్చిన **సత్యాన్ని అడ్డగించినవారు అవుతారు** ఆత్మీయ మరణమే దాని ఫలితం. రోమా. 1:18-32లో వర్ణింపబడినట్టి శీలమే ఆత్మీయ మరణం. గతించి పోయిన కాలంలో అన్య జనులు సత్యాన్ని అంటే జీవ నియమాన్ని అడ్డగించి మరణ లక్షణాలు ఇరువది ఒక్కంటిని వృద్ధిచేసుకొన్నారు. దేవుని కుమారులుగా ఉండగలిగే శక్తిసామర్థ్యాలను వారు కోల్పోయారు.

మానవులు తమ జీవితాల్లో చేయగలిగిన దానికంటే మించిన సంగతులు జీవితానికి ఉన్నాయని బైబిలు గ్రంథం క్రైస్తవులకు నేర్పిస్తుంది. “ఆహారముకంటే ప్రాణమును, వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా?” అని యేసు అడిగినారు (మత్తయి 6:25). “దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండినందున, సువార్తప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుటకు దేవుని దయాపూర్వక సంకల్పమాయెను” అని పౌలు చెప్పాడు (1 కొరింథీ. 1:21). చాలా వచనాలలో “రక్షణ” అనే మాట పాపక్షమాపణ అను దానికంటే మించిన భావంలో వాడబడింది. రక్షింపబడుట అంటే బలహీనమైన శీలం నుండి రక్షింపడుట అని చెప్పవచ్చును. దేవుని కుమారులుగా ఉండే **శక్తిసామర్థ్యాలు** మనకున్నాయి. కాని, దేవుడు మనమాయన పిల్లలుగా అభివృద్ధిచెందు ఒక నియమాన్ని కలిగి ఉన్నాడు. యేసును ధ్యానించుట ద్వారా దానిని మనం కనుగొంటాము. (2 కొరింథీ. 4:4) మనకు మహిమపొందవలెనను సహజ అవసరత ఉంది, మహిమాన్విత వ్యక్తులుగా ఎలా ఉండాలో ఆయన చూపిస్తాడు, మనం చేయవలసిందంతా జరిగి నప్పుడు అంతా క్షేమంగా ఉంటుందని తెలిసుకోవటం చాలా ఆనందదాయకమైన సంగతి. “అతిశయించు వాడు ప్రభువునందే అతిశయింపవలెనని వ్రాయబడినది నెరవేరునట్లు” (1 కొరింథీ. 1:31). అనియు, “మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము” (ఎఫెసీ. 2:10) అనియు పౌలు చెప్పినప్పుడు, పౌలు మనస్సులో మనం చెప్పుకొనిన సంగతులు ఉండవచ్చు. మహిమ గల ప్రజలు నీతిని జరిగిస్తారు (రోమా 6:19).

జీవ నియమం క్రైస్తవులకు చేకూర్చే ప్రయోజనం ఎలా ఉంటుందో తెలియజేసే రెండవ పాయింటును ఇప్పుడు మనం ఆలోచించుదాము. మన యొక్క శ్మృతిలో నిక్షిప్తమైన కార్యక్రమం లేక, దత్తాంశం లేక సమాచారం అను దానికి సంబంధించినదే మన రెండవ విషయం. శ్మృతి పదంలో దాచబడిన ఈ సమాచారం మనస్సాక్షి మీద పనిచేస్తూ వుంటుంది. W. E. వైన్ చెప్పినట్లు మనస్సాక్షి అనేమాట “సునైడేసిస్” (SUNEIDESIS) అనుగ్రీకు పదం నుండి తర్జుమా చేయబడింది. ఈ మాటయొక్క భావమేమనగా “తనంతట తానుగా తెలిసికొనుట.” మనస్సాక్షి యొక్క ప్రముఖమైన పని సాక్ష్యమివ్వటం. కోర్టు హాలులో ఏమి జరుగుతుందో అదే మన మనస్సులో జరుగుతుంది. తత్ఫలితంగానే మనస్సాక్షి సాక్ష్యం పలుకుతుంది. మనం చేసే పనులలో ఒక ప్రత్యేకమైన ప్రవర్తనను మనం కనబరుస్తాము. మన ప్రవర్తనపైమనమే స్వయంగా తీర్పు చెప్పుకుంటాము. తత్ఫలితంగా మనస్సాక్షి సంకేతం అందుకొని మన ప్రవర్తనపై సాక్ష్యం చెబుతుంది. ఏ విధంగా ప్రవర్తిస్తే బాగుంటుందని మనం అనుకుంటామో ఆ ప్రమాణాన్ని బట్టి మనకు మనం తీర్పు తీర్చుకుంటాము (రోమా 14:23; యాకోబు 4:17). ఆదాము హవ్వలు మంచి చెడ్డల తెలివిని పొందిన తరువాత

ఇది మానవులకు జరిగెను (ఆది. 3:22) వారు ఎరిగిన వారైరి. "మేలు కీడులను వివేచించుటకు" మనల్ని మనం సుక్షితులను చేసుకోవాలి (హెబ్రీ. 5:14).

అది ఈ విధంగా పనిచేస్తుంది: ఈ మధ్యే ఒక సంఘటన జరిగిందనుకుందాము. ఆ సంఘటనలో మనం నిజంగా చేసిందేమిటో మన ఆలోచనలకు తెలుసు. మనం ఎలా ప్రవర్తించాలో తెలియజేసిన పాత సమాచారం మనశ్మృతిలో దాచబడివుంది. మనం ఎలా ప్రవర్తించామో తెలియజేసే క్రొత్త సమాచారంతో దీనిని సరిపోల్చినపుడు అది మన మీద తప్పు మోపుతుంది లేదా తప్పు లేదని చెబుతుంది. మన మనస్సాక్షి మంచిదియు, పవిత్రమునైన స్థితిలో వుంటుంది లేదా దోషారోపణతో అపవిత్ర పరచబ డుతుంది (1 తిమోతి 1:5; 3:9; తీతు. 1:15). "మానసికకోర్టు" వాయిదా వేసిన తరువాత మనస్సాక్షి యొక్క పరిస్థితిని బట్టి సాక్ష్యం ఇవ్వబడుతుంది." అట్టివారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒక దాని మీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్రసారము తమ హృదయ ములయందు వ్రాయ బడినట్టు చూపుచున్నారు" అని చెప్పి, మనలను గూర్చినకొంత సమాచారాన్ని పౌలు మనకు ఇచ్చినాడు (రోమా. 2:15).

పైన చెప్పిన "మానసిక కోర్టు" వ్యవహారం కోసం మానవుల మనస్సుల్లోని శ్మృతి పథంలో సమాచారం **చిరుప్రాయం**లోనే నిల్వ చేయబడటం ఆరంభమౌతుంది. మనపై మనమే తీర్పుచెప్పుకోటానికి వినియోగించే దత్తాంశం అంటే సమాచారం తల్లి దండ్రుల వల్ల, ఉపాధ్యాయుల వల్ల, స్నేహితులవల్ల "సప్లై" చేయబడుతుంది. ఈ దత్తాంశమే మన మనస్సుల్లోని న్యాయవిచారణా విభాగాన్ని ముందు గానే క్రమబద్ధం చేస్తుంది మనం సేకరించిన సమాచారం సరియైనదేకావచ్చు లేదా సరియైనదికాక పోవచ్చు. సమాచారం ఎలాంటిదైనా, దానిని పట్టించుకోము ప్రత్యేకమైన ప్రతిసందర్భం లోను మన జీవితాల్లో ఎలాంటి ఉద్వేగపూరిత ప్రవర్తనను వ్యక్తం చేస్తామో దాని విష యంలో మనపై మనం తీర్పుచెప్పుకోటానికి ఆ సమాచారాన్నే ఉపయోగించుకుంటాము.

సరియైన ప్రవర్తన విషయంలో తప్పుడు సమాచారం కలిగి ఉండిన వానిగా ఒక సందర్భమందు తన జీవితంలో అపొస్తలుడైన పౌలు ఒక ఉదాహరణగా ఉన్నాడు. పౌలు మహాసభ వారిని తేరిచూచి, "సహోదరులారా, నేను నేటివరకు కేవలము మంచి మనస్సాక్షిగలవాడనై దేవుని యెదుట నడుచుకొంటిని" అని ఒక సందర్భంలో చెప్పాడు (అపో. కార్య. 23:1). అయినప్పటికినీ, "పూర్వము దూషకుడను, హింసకుడనుహాని కరుడను," అని అతడు తిమోతికి చెప్పాడు (1 తిమోతి 1:12,13). క్రైస్తవ్యం లోనికి అతడు మార్పు చెందక పూర్వం ఈ ప్రధాన పాపి మనస్సాక్షి దోషారోపణా మలినాన్నిఎలా తప్పించుకొనెను? పాలస్తీనా క్రైస్తవులను హింసించటం విషయంలో తనపై తాను తీర్పు చెప్పుకోటానికి అతని శ్మృతిలో నిల్వచేయబడిన సమాచారం సరియైనది కానం దున అతని మనస్సాక్షి అతనిపై తీర్పు తీర్చినది (అపో. కార్య. 9:13,14). ఒక వేళ పౌలుకు యేసు కనిపించిన తరువాత అతడు క్రైస్తవులను హింసించియుంటే అతనిమన స్సాక్షి తప్పక అతనిపై దోషారోపణ చేసియుండెడిదే! క్రైస్తవుడైన తరువాత ఏవిధంగా ప్రవర్తించాలని అతడు నమ్ముతాడో ఆ విషయంలో అతిక్రమం జరిగిందని అతనిమన స్సాక్షి సాక్ష్యం చెప్పియుండెడిదే! తత్ఫలితంగా, అతడు దోషారోపణ చేసే మనస్సాక్షిని కలిగి జీవించవలసివచ్చెడిది. కాబట్టి, మనస్సాక్షిపై దోషా రోపణ సమర్ధవంతమైనసాక్షిగా పనిచేస్తుందని మనం చూడగలం. మనం సరిగా లేమని చెప్పటానికి మనకు వ్యతిరేక మైన సాక్షి మన అపరాధ భావమే. కొరింథులోని దేవుని సంఘానికి పౌలు సెల విచ్చాడు:"మా అతిశయమేదనగా, లౌకిక జ్ఞానము ననుసరింపక, దేవుడనుగ్రహించు పరిశుద్ధతతోను నిష్కాపట్యముతోను దేవుని కృపనే అనుసరించి లోకములో నడుచుకొంటి మనియు, విశేషముగా మీ యెడలను నడుచు కొంటిమనియు, మా మనసాక్షి సాక్ష్య మిచ్చుటయే" 2 కొరింథీ. 1:12.

పౌలు జీవితాంతం మంచి మనస్సాక్షిని కలిగిఉండటం సంతోషదాయకం. తనకు కలిగిన దర్శనానికి అతడు విధేయుడు కావటం వల్లనే అది సాధ్యమైంది. పాపులు తమపై తాము అనేకమైన నేరాలు మోపుకోవచ్చు. ఎందుకంటే, తమ జీవితం కోసం తాము ముందుగానే నిల్వచేసు కొనిన సమాచారాన్ని వారు అతిక్రమించటం జరుగుతూనే వుంటుంది. ఆ కారణంగా వారి మనస్సాక్షి వాత వేయబడుతుంది (1 తిమోతి 4:3). హృదయం కఠినపరచబడటం దాని ఫలితమౌతుంది. యేసు క్రీస్తు రక్తం మాత్రమే దోషారోపణను తొలగించివేసి హృదయాన్ని పునరుద్ధరించగలదు (హెబ్రీ. 9:13,14). క్రైస్తవులెవరైనా తమ ప్రవర్తనను గాని, ఇతరుల ప్రవర్తనను గాని విమర్శచేయ టానికి సరియైన సమాచారం కలిగియుండక పోతే అట్టివారు **బలహీనమైన మనస్సాక్షి గలవారు** (1 కొరింథీ. 8:1-13). సరియైన జ్ఞానం లేనివారు పొరపాటు చేయటానికి ధైర్యం తెచ్చుకోవటం సాధ్యమేనని పౌలు కొరింథీలోని క్రైస్తవులకు వివరించాడు. మరో విధంగా చెప్పాలంటే, సరియైన జ్ఞానం లేనివారి మనస్సాక్షి దోషారోపణ చేయవలసిన పరిస్థితుల్లో దోషారోపణ చేయకపోవటం, దోషారోపణ చేయకూడని పరిస్థితుల్లో దోషా రోపణంచేయటం కారణంగా సరియైన సాక్ష్యం ఇవ్వలేక పోతుంది. బలహీనమైన మనస్సాక్షి అనే సమస్యకు అధికంగా బైబిలు గ్రంథాన్ని చదవటం,దానిని అర్థం చేసుకోవటం సరియైన పరిష్కార మార్గాలు. అదాము ద్వారా మంచి చెడులు ఎరుగుజ్ఞానము మనము కలిగియున్నాము, కాబట్టి దానిని వివేచించు తర్ఫీదు మనకవసరం (హెబ్రీ. 5:14).

జీవ నియమమును గూర్చి ఈ సందర్భంలో మనం అర్థం చేసుకోవాలని ఆశించే విషయం ఏదంటే, మన సొంత ప్రవర్తన విషయంలో మనంతట మనమే **మానసిక కోర్టును నిర్వహించుకోటానికి** అత్యంతశ్రేష్టమైన సమాచారముగా అది (జీవ నియమం) పనిచేయటం అనే సంగతి. మానవులను దేవుడు రూపొందించిన విధం జీవ నియ మానికి అనుగుణంగా ఉండినందున ఇది యదార్థమని నిశ్చయంగా చెప్పవచ్చు. దేవుడు మనల్ని అర్థం చేసుకోగలడని, మన కోసం జీవనియమాన్ని ఇవ్వగల సమర్ధుడనీ క్రైస్తవులమైన మనం నమ్ముతాం. జీవనియమం అనేది జీవం అనేదాని

యొక్క సంపూర్ణ వివరణ. దేవుడు మనల్ని సృష్టించింది జీవాన్ని సమృద్ధిగా పొందటానికే మన స్వభావానికి విరుద్ధమైన సమాచారంతో మన యొక్క న్యాయవిచారణా విభాగం క్రమబద్ధం చేయబడితే తీవ్రమైన ఒక ఘర్షణ మనలో ఆరంభమౌతుంది. ఉదాహరణకు, "పుచ్చుకొనుటకంటే ఇచ్చుట ధన్యము" అనేది యేసు నేరుగా చెప్పిన జీవ నియమాలలో ఒక నియమం. (అపొ. కార్య. 20:35). ఈ నియమంతో క్రమబద్ధం చేయబడిన మనస్సాక్షి న్యాయ విచారణా విభాగం మన ప్రవర్తనపై తీర్పు చెప్పునప్పుడు అభివృద్ధి చెందిన ప్రకారం మనం కానుకలు ఇవ్వటానికి భయపడము. మనం చేస్తున్న కార్యానికి, మరియు ఏదిచేయాలని మనం నమ్ముతామో దానికి మధ్య ఘర్షణ ఏదీ ఉండదు. అంతకంటే ముఖ్యసంగతి ఏదంటే, మన మనస్సాక్షి యొక్క సాక్ష్యం మరియు మన స్వభావం అనే వీటిమధ్య కూడా ఘర్షణ ఉండదు.

పుచ్చుకొనినప్పటి కంటే కూడా ఇచ్చినపుడే ఎక్కువ సంతోషం కలుగుతుందని యేసు మనకు నేర్పించారు. ఈ మాటను సందేహించేవారు మనలో ఉండవచ్చునేమో! అయితే, ఈ జీవ నియమాన్ని మనం ఆచరణలో పెట్టినప్పుడు మన స్వభావానికి ఈ నియమం అనుగుణమైనదేనని మనకు తెలిసిపోతుంది. "ఇచ్చుటకంటే పుచ్చుకొనుట ధన్యము" అని నమ్మే క్రైస్తవులు కానుకలు ఇస్తూ, వారు నమ్మిన ఈ సూత్రం ఆధారంగా తమ ప్రవర్తనపై తీర్పు చెప్పు కొనినప్పుడు వారిలో ఒక విధమైన సంఘర్షణ యేర్పడు తుంది. అట్టివారు వారు అభివృద్ధి చెందినకొలది కానుకలు ఇస్తే వారి మనస్సాక్షి మరియు వారి ప్రవర్తన అనువాటి మధ్య సంఘర్షణ ఉంటుంది. ఒకవేళ, వారు అభివృద్ధి చెందిన కొలది కానుకలు ఇవ్వకపోతే, వారి యొక్క స్వభావం మరియు వారి యొక్క ప్రవర్తన అనువాటి మధ్య సంఘర్షణ ఉంటుంది. ఈ సంఘర్షణ విషయంలో దోషారోపణతో నిండిన వారి మనస్సాక్షి సాక్ష్యం పలుకుతుంది. తత్ఫలితంగా, ఆ సంఘర్షణ వల్ల వారి శీలం బలహీన పరచబడుతుంది. మనలోని అంతరంగిక సంఘర్షణ లను మనం మాన్పివేసుకోటానికి మన న్యాయ విచారణా విభాగాలు జీవ నియమం ద్వారా మన కోసం క్రమబద్ధం చేయబడటం అనేది చాలా ముఖ్యమైన విషయం. ఇది అంతర సంఘర్షణను అడ్డుకొని అధారపడదగు మనస్సాక్షిని ఇస్తుంది.

మన మనస్సాక్షికి, మన వ్యక్తిత్వానికి మధ్యగల సంబంధాన్ని అన్వేషించటానికి మనకు సమయం చాలదు. అయితే, ఈ రెంటికీ మధ్య అత్యంత సునిశితమైన సంబంధం ఉందని మనకు తెలుసు. ఉదాహరణకు, మలినమైన మనస్సాక్షిని కలిగి యుండి మలినమైన మనస్సును కలిగియుండక పోవటం అసాధ్యం (తీతు. 1:15). ఎఫెసీ. 4:17-19లో, వ్యర్థమైన మనస్సు కలిగిన వారి జీవన విధానాన్ని పౌలు వివరిం చాడు. దేవుని జీవనియమం ఎరిగియుండకపోతే దోషారోపణ తీసి వేయబడకుండానే భక్తిహీనమైన ప్రవర్తనను అనుమతించటానికి మనస్సాక్షికి అవకాశం కలుగుతుంది (1 కొరింథీ. 8:10). దేవుని నిత్య కుమారులుగా మన లక్ష్యాలను సాధించగలమనే మన ధైర్యాన్ని మనస్సాక్షి యొక్క ప్రతికూల సాక్ష్యం నాశనం చేయగలుగుతుంది (2 కొరింథీ. 1:12).

తన మనస్సాక్షిని తాను గాయపరచుకోవటం కంటే తనకుతాను చేసుకొనే ఘోరమైన హాని మరొకటి ఉండదు. మన మనస్సాక్షిని కలవరంలో పెట్టటానికి కారణమైన దోషారోపణను కలిగించే కార్యాన్ని మనం ఎన్ని మారులు చేయలేదు? ఒక్కనిమిషం ఆలోచించు. అట్టి మానసిక సంక్షోభంతో మనస్సాక్షిని గాయపరచినది మరెవరోకాదు. అది మనమే, పరిశుద్ధపరచబడు కార్యక్రమంలో మనస్సాక్షి కీలక పాత్ర వహిస్తుంది. అందువల్ల, జీవమునుగూర్చి సరియైన సమాచారంతో మన మనస్సుల్ని క్రమబద్ధం చేసుకొని, మనస్సాక్షిని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి. "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యదార్థమైనది, అది ప్రాణమును తెప్పరిల్ల జేయును" అని దావీదు చెప్పాడు (కీర్తన. 19:7). మనమనస్సాక్షి పరిశుద్ధపరచబడుట మనలను నడిపించు భాగములో ముఖ్యమైనది.

క్రైస్తవుని జీవితంలో జీవనియమం యొక్క ప్రయోజనం అనే అంశానికి సంబంధించి ఈ పాఠంలో మనం చర్చించబోయే చివరి విషయం జీవనియమం యొక్క ఫలము ఎలా ఉంటుందో వివరిస్తుంది. మనం గతంలో సాధించిన ఆత్మీయ పెరుగుదల ఫలాన్ని ప్రస్తుతం మనం కొనసాగించు చున్న పరిశుద్ధపరచబడు కార్య క్రమానికి అన్వయింపజేసి, ఆ మీదట దాని ప్రభావాన్ని గూర్చి ఆలోచించుదాము. "మహిమలో నుండి అధిక మహిమలోనికి" అనేది మహిమ మార్గమని కూడా మనం అర్థం చేసుకొందాము (2 కొరింథీ. 3:18). మరో విధంగా చెప్పాలంటే, ఆత్మీయ పెరుగుదలలో మరింత అధికంగా అభివృద్ధి సాధించాలంటే అంతవరకూ సాధించిన అభివృద్ధి ఫలం సహాయకరంగా ఉంటుంది (రోమా 5:3-5). నిన్నటి జీవితంలోని **ఆత్మీయ సాధనాలు** నేటి జీవిత నిర్మాణానికి ఎంతో అవసరం. జీవితం అనేది ఒకసారి ప్రదర్శింపబడి సమాప్తం అయ్యే నాటకం కాదు. అది నిరంతరం ప్రదర్శింపబడే విలువైన నాటకం. "కాబట్టి, ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండ మీద తన ఇల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలి యుండును" అని యేసు చెప్పారు (మత్తయి. 7:24). (కొండమీది ప్రసంగం కేవలం జీవనియమాలతోనే నిండివుందని దయతో గమనించండి). మనం యేసు మాటలు విని వాటి ప్రకారం జరిగించిన మీదటనే, కష్టసమయాలలో మనం "బండమీద కట్టిన ఇంటి" వలె ఉండగలము. క్రైస్తవులు తమ జీవితాల్ని చక్కగా కట్టుకోటానికి ఏకైక పునాది లేదా జీవం యేసుక్రీస్తే. ఈ క్రింది లేఖనం ఇదే విషయాన్ని తెలియజేస్తుంది.

*మేము దేవుని జతపనివారమై యున్నాము మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునైయున్నారు. దేవుడు నాకనుగ్రహించిన కృపచొప్పున నేను నేర్పరియైన శిల్ప కారునివలె పునాదివేసితిని, మరియొకడు దాని మీద కట్టుచున్నాడు ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగా*

*చూచుకొనవలెను. వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు ఈ పునాది యేసుక్రీస్తే.* 1 కొరింథీ. 3:9-11

గతంలో సాధించిన ఆత్మీయ పెరుగుదలపైనే క్రైస్తవులు తమ జీవితాలను నిర్మించుకుంటారని ఈ క్రింది లేఖనం మనకు స్పష్టంగా చూపిస్తుంది. ఒక సుగుణంతో మరో సుగుణాన్ని చేర్చుకోవటం జరుగుతుందని కూడా ఈ లేఖనాన్ని బట్టి మనం స్పష్టంగా చూడగలం.

*ఆహేతువు చేతనే మీమట్టుకు మీరు పూర్ణజాగ్రత్తగలవారై, మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి.* 2 పేతురు 1:5-7

ఆత్మ ఫలం ఏదంటే ప్రేమ, సంతోషం, సమాధానం, దీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసం, సాత్వికం మరియు ఆశానిగ్రహం. ఇట్టివాటికి విరోధమైన నియమం ఏదీలేదు. ఎందుకంటే, జీవనియమాన్ని మనకు అన్వయించుకోవటంవల్ల కలిగిన ఫలం ఇదే (గలతీ. 5:22,23). ఆత్మ జీవాన్ని, స్వాతంత్ర్యాన్ని ఇవ్వటమంటే ఇదే (2 కొరింథీ. 3:6,17). మనము స్వేచ్ఛగాఎదిగి శక్తి సామర్ధ్యాలను పొందుతాము. జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమం పాపమరణ నియమము నుండి మనలను విడిపించుచుండినపుడు, పరిశుద్ధాత్మ కూడా అదే సమయంలో వాక్యం ద్వారా మనలను నడిపిస్తాడు. శరీర విషయముల కంటే ఆత్మ విషయములే ప్రాధాన్యమని ఆయన మనకు నొక్కి చెప్పుతాడు (రోమా. 8:5-8). "మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై యుందురుగాని ఆత్మచేత శారీర క్రియలను చంపిన యెడల జీవించెదరు" అని అపొస్తలుడైన పౌలు చెప్పాడు (రోమా. 8:13). క్రైస్తవులు ఎల్లవేళలా శరీరానుసారమైన జీవిత విధానంలో నుండి ఆత్మానుసారమైన జీవిత విధానంలోకి మారుతూనే వుంటారు (గలతీ. 5:16,17). క్రైస్తవ జీవితం శక్తివంతమైన జీవితం. ఎందుకంటే, మార్పు అనేది ఆ జీవితంలో ఎడతెరిపిలేకుండా సంభవిస్తూ ఉంటుంది. కాబట్టి, ఈనాడు మనం శారీరక క్రియల్ని చంపటం అనేది రేపు మనం"దేవుని పోలి నడుచుకోటానికి" సహాయం చేస్తుంది (ఎఫెసీ. 5:1).

గతంలో మనం సాధించిన ఆత్మీయ పెరుగుదల మన వర్తమాన జీవితానికి ఎంత ప్రయోజనకరంగా వుంటుందో వివరించే విధానాన్ని మనం ఇంకా మరికొంత ధ్యానించటానికి ముందుగా మరియొక ప్రముఖమైన భావాన్ని మనం ఆలోచించుదాము. మానవుల మధ్యన ఉండవలసిన సంబంధంతోనే జీవ నియమం వ్యవహరి స్తుందని ఆత్మఫలములోని అంశాలు మనకు తెలియజేస్తున్నాయి. (రోమా 8:29). కొందరితో ఒక రీతిగాను, మరి కొందరితో ఇంకొకరీతి గాను జీవ నియమం వ్యవహరిం చదు ఉదాహరణకు, దయాళుత్వం గలవారు ఇతరులకు ఉపయుక్తంగానే ఉంటారని అర్థమిస్తుంది. అట్టివారు ఇతరులకు ప్రయోజనకారులుగా ఉంటారు. మంచితనం అనే మాటలో నైతిక గుణం యిమిడివుంది. ఆ గుణం కలిగి యుండినవారు ఇతరులకు లాభదాయకంగా వుంటారని భావించవచ్చు. వాస్తవానికి, నిత్యజీవం అనేమాటలోని జీవం అనేదాన్ని మనం కనుగోటానికి ప్రజలలో ఏది జరిగిందో దానిని చూడక, ప్రజల మధ్య ఏం జరుగుతుందో దానినే చూడాలి. ప్రజల మధ్య ఏది జరుగుతుందో సాధారణంగా అదే ప్రజలలో జరుగుతున్న దాని ఫలితమని అవశ్యంగా మనం గుర్తించ వచ్చు. జీవం లేక ఆత్మ ఫలం అనుదానిలో ఉండిన అనేకమైన అంశాలు ఆయా వ్యక్తుల మధ్య ఏమి జరుగుతుందో దానినే వివరిస్తాయి. రెండు వర్గాల మధ్య ఏమి జరుగుతుందో దానినే వివరిస్తాయి. రెండు వర్గాల మధ్య ఏదో కొంత మంచి సంభవించ నంత వరకూ ప్రేమ బయలుపరచబడదు (1 యోహాను 3:16-18). కాబట్టి, జీవ నియమం అనేది దేవుని రాజ్య సంబంధమైన సమాజంలోని జీవాన్ని వివరిస్తుంది. ఈ రాజ్యంలో ఉన్న అందరికీ ఈ సంగతి వర్తిస్తుంది.

జీవ నియమం యొక్క ఫలం వల్ల కలిగే ఒక ప్రయోజనం ఏదనగా ఇతరులతో మనం బాగుగా వ్యవహరించగలం మనం అర్థం చేసుకొన్న సంగతి ఇదే. ఈ ఆలోచన మన మనస్సు నందుంచుకొని, నిన్నటి మన ఆత్మీయ పెరుగుదల నేటి మన పెరుగుదల ప్రక్రియలో ఎలా సహాయకరంగా వుంటుందో వివరించే విధానాన్ని ఆలోచించుదాము. మనలో కొన్ని సహజ కోరికలు అంటే అవసరాలు ఉన్నాయి. ఈ అవసరాల సంతృప్తి కోసం మనం అన్వేషణ సాగిస్తాము. అప్పుడా కోరికలు మనల్ని స్వాభావిక ప్రపంచం తోను, ఇతరులైన మనుష్యులతోను చేతనాపరమైన సంబంధాన్ని కలిగి ఉండేటట్లు చేస్తాయి. మనకు ఎదురైన అనుభవాల ఫలితంగానే మన యొక్క వ్యక్తిత్వం, శీలం అనేవి వికాసం చెందుతాయి. విజయవంతమైన సంఘటనలు మనకు ఎదురైతే ప్రేమ మరియు విశ్వాసంలాంటి ఆరోగ్యకరమైన ఉద్వేగ వైఖరులను వృద్ధి చేసు కుంటాము. ఒక వేళ మనం జీవితంలో ఓడిపోతే కోపిష్టులుగానో లేదా భయస్తులుగానో మిగిలిపోయే ప్రమాదం ఉంది. జీవ నియమమును కలిగినవారమై, సహజ వాంఛల సంతృప్తిని వెదికే కార్యక్రమంలో ఉండటం వల్ల కలిగే ప్రయోజనం స్పష్టంగానేఉంది. తనలోని సహజాత వాంఛల సంతృప్తిని బుద్ధిగలవాడు కనుగొనగలుగుతాడు లేదా కనీసం సంతృప్తి సాధించవచ్చుననే నిరీక్షణనైనా కలిగి ఉంటాడు. మన కోరికల సంతృప్తి మన వ్యక్తిత్వాన్ని మెరుగు పరుస్తుంది. జీవం మరియు తత్ఫలితంగా వృద్ధి చెందు శీలం అనువాటి విషయంలో మానవుడు సాగించే అన్వేషణకు సంబంధించి ఇది నిశ్చయంగా సూక్ష్మీకరింపబడిన వృత్తాంతమే. అయితే, ఇది ఒక మంచి నమూనా మానవుడు తన యొక్క అన్వేషణలో తనతో పాటుగా దేవుని ఆజ్ఞలను, జీవ నియమాన్ని తీసుకొనినపోవటం వల్ల ఎంత ప్రయోజనం వుంటుందో మనం చూడగలం.

జీవం అనేది ఒక చక్రం ఎలా కాగలుగుతుందో మనిమిపుడు ఆలోచించుదాము. సాధారణంగా మన వ్యక్తిత్వాలు మనయొక్క మామూలు ప్రవర్తనకు అనుగుణ్యం గానే ఉంటాయి.

అంటే, నేను దీర్ఘశాంతముగలవాడనైతే ఓపికతో కనిపెడతాను. ఒకవేళ నేను దయగలవాడనైతే మానవాళి భవిష్యత్తు కోసం ఏది మంచిదో దానినే చేస్తాను. ఇతరుల పట్ల మనం యుక్తంగా ప్రవర్తించినపుడు సాధారణంగా వారు మన సహజ వాంఛల సంతృప్తికోసం మనకు సహాయం చేస్తారు. బంగారు సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. "కావున, మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగు ననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది" (మత్తయి 7:12). మనకు అవసరాలు ఉన్నాయి. అలాగే, ఇతరులకు కూడా అవసరాలు ఉన్నాయి. ఇతరులు తమ అవసరాలు సంతృప్తిని సంపాదించుకోవటానికిమనం వారికి సహాయం చేస్తాము. అదే రీతిగా, వారు కూడా మనకు సహాయం చేస్తారని నిరీక్షించగలుగుతాము.

జీవపు చక్రంలో ఒక ఘట్టం పూర్తి చేయబడిందని దయతో గమనించండి. మన యొక్క అవసరాలు యుక్తంగా సంతృప్తి పరచబడితే తత్ఫలితంగా ఆరోగ్యవంతమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని మనం జ్ఞాపకం చేసుకొందాము. ఆరోగ్యవంతమైన వ్యక్తిత్వం ఇతరుల పట్ల కనుబరచటానికి యుక్తమైన ప్రవర్తననే ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి, మన అవసరాలను తీర్చుకోవటంలో ఇతరులు మనకు సహాయం చేస్తారు. జీవపు దశలు కొనసాగుతూనే వుంటాయి. మన వ్యక్తిత్వము ఎంత ఆరోగ్యంగా ఉంటుందో అంతే ఆరోగ్యంగా మన ప్రవర్తన కూడా ఉంటుంది. అప్పుడు మాత్రమే మన సహజ కోరికల విషయంలో ఎక్కువగా సంతృప్తిని సాధించగలుగుతాము. యేసే మనకు జీవనియమం. యేసువలె మన వ్యక్తిత్వం ఎంత ఎక్కువగా వృద్ధి చెందుతాదో మన క్రియలు కూడా అంత ఎక్కువగా నీతిగలవిగా ఉంటాయి. సమాజం మరియు దేవుడు మనం కనుబరచిన మంచి ప్రవర్తనకు బహుమానాలు ఇస్తారు. ఆహారం, వస్త్రం,నివాసం మరియు వీటితో పాటుగా రక్షణ మనకు దొరుకుతుంది. జీవం (జోయే) అనుదానికి సంబంధించిన ఈ దశకు చేరుకోవటం సాధ్యమే. ఎందు కంటే, ఆత్మీయ పెరుగుదలే ఆత్మీయ పెరుగుదలకు, అంటే మరింత ఎక్కువగా జీవంలోకి వృద్ధిచెందటానికి సహాయం చేస్తుంది.

మత్తయి 5:3-12లో యేసు ధన్యతలను వివరించినారు. ఇవి ఉద్వేగ భరితమైన వైఖరులు. క్రైస్తవులు సంతృప్తితో జీవించినా, లేక సహజ కోరికల విషయంలో సంతృప్తి లభించగలదనే నిరీక్షణ గలిగి జీవించినా తత్ఫలితంగా వైఖరులు వారి జీవితాల్లో వృద్ధి చెందుతాయి. సంతృప్తిని సాధించ గలమనే నిశ్చయత మనకు కలగాలంటే దేవుని ఆజ్ఞలను మనం వెంబడించాలి. ఉదాహరణకు, లైంగిక సంతృప్తి కోసం ఒక్క పురుషుడు, ఒక్క స్త్రీ వివాహం చేసుకోవాలి అనేది దేవుని ఆజ్ఞ (1 కొరింథీ. 7:1-5). దేవుని ఆజ్ఞలను మనం పాటించకపోతే మన జీవిత దశలు ఎంతగా భ్రష్టత్వం చెందగలవో మనం చూడగలం. ఆరోగ్యవంతమైన మన సహజ కోరికలు బాహ్య ప్రపంచంలోకి మనల్ని బలంగా తోస్తాయి. దేవుని నడిపింపును మనం కలిగి ఉండని పక్షంలో మానవ జ్ఞానాన్నే వినియోగించుకుంటాం. తత్ఫలితంగా మనం నిజమైన సంతృప్తిని సాధించలేకపోతాము. మనము విఫలమైనప్పుడు ప్రతిమారు భయం, కోపం అను వాటితో నిరాశా నిస్పృహలకుగురైపోతాం. మన వ్యక్తిత్వం కూడా ఆ రూపం లోనే వుంటుంది.

ఈలాటి వ్యక్తి ఇతరులతో వ్యవహరించునప్పుడు యేసు చెప్పిన "సువర్ణ సూత్రాన్ని" ఎంత మాత్రం వినియోగించుకోడు. అట్టి మనుష్యుని యొక్క అక్రమ ప్రవర్తన తన అవసరాలకు సంతృప్తి నిచ్చే అవకాశాల్ని తగ్గించివేస్తుంది. సంతృప్తిలేమి బలహీన శీలాన్ని, అనారోగ్యకరమైన వ్యక్తిత్వాన్ని పుట్టిస్తుంది. బలహీనమైన శీలం మరియు అనారోగ్యకరమైన ఉద్వేగ వైఖరులు చెడ్డ ప్రవర్తనను పుట్టిస్తాయి. చెడుప్రవర్తన దగ్గరే ఈ స్థితి ఆగిపోక తదుపరి దశకు నడపిస్తుంది. పాపం ఎక్కడ ఏలుబడిచేయునో అక్కడే మరణము అనే స్థితి తదుపరి దశ ఔతుంది. మరణబలం నుండి మానవుల్ని విడిపించగలిగేది యేసుక్రీస్తు సువార్త మాత్రమే.

జీవ నియమం జీవము (జోయే -ZOE) అనే దాని యొక్క వివరణం పరిపూర్ణమైన జీవం యేసు కలిగి ఉన్నారు. మానవాళి దేవుని కుమారులుగా ఉండటానికే సృష్టింప బడినందున, యేసే మనకు జీవపు వెలుగు. ఒకవేళ ఎవరైనా ఈ సత్యం విషయంలో గ్రుడ్డివారుగా ఉంటే అట్టివారు చీకటిలోనే జీవించి నశించిపోతారు (2 కొరింథీ. 4:3,4) జీవాన్ని మనం కలిగి ఉండక పోతే, దేవుని నిత్య రాజ్యంలో మనకు స్థానం వుండదు. మనలను గూర్చిన సత్యాన్ని తెలిసి కోటానికి తీర్పు దినం వరకు వేచి ఉండవలసిన అగత్యం మనకు లేదు.

> *మీరు విశ్వాసముగలవారైయున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి మిమ్మును మీరే పరీక్షించుకొనుడి మీరు భ్రష్టులు కానియెడల యేసుక్రీస్తు మీలో నున్నాడని మిమ్మును గూర్చి మీరే యెరుగరా?*
> *2 కొరింథీ. 13:5*

## చర్చ కోసం ప్రశ్నలు

1. ఆజ్ఞాతిక్రమము పాపమని చెప్పినప్పుడు, గ్రహీతలు దేనిని ఎరిగియున్నారని అపొస్తలుడైన యోహాను భావించినాడు?
2. జీవ నియమం అనేది బైబిలు అంశమేనని నిరూపించు కొన్ని లేఖనాల్ని వరుసగా వ్రాయండి?
3. జీవ నియమం మరియు మోషే ధర్మశాస్త్రం అను వాటి మధ్య ఉండిన వ్యత్యాసాన్ని వివరించండి?
4. జీవ నియమం అనేది ఎట్లు ప్రకృతి నియమం వంటిదో చూపించుము?
5. జీవ నియమంలోని ఏ సూత్రాన్ని ఆదాము అతిక్రమించాడు?
6. మన వ్యక్తిత్వానికీ, మన ప్రాథమిక అవసరాలకీ మధ్య గల సంబంధాన్ని యెషయా ప్రవక్త చెప్పిన ఉపమానం ఎట్లు వివరిస్తుంది?

7. మోషే ధర్మశాస్త్రాన్ని దేవుడు ఏ నియమానికి చేర్చాడు ?
8. యేసు ద్వారా జీవనియమం క్రైస్తవ జీవితానికి అన్వయింపబడినపుడు ఏమి జరుగుతుంది ?
9. జీవ నియమాన్ని ఎరిగి ఉంటే మరణకరమైన సాంస్కృతిక లక్షణాల నుండి మనుష్యులు ఎట్లు విడుదల పొందుతారో వివరించుము ?
10. జీవపు శక్తిని ప్రజలు ఎట్లు సాధింపగలరు?
11. జీవ నియమాన్ని ఎరిగి ఉంటే అనువంశికమైనట్టి వ్యక్తిగత లోపాల నుండి క్రైస్తవులు ఎట్లు విడుదల పొందగలరో వివరించుము?
12. దేవుని గూర్చిన సత్యాన్ని ప్రజలు అడ్డగిస్తే ఏం సంభవిస్తుంది?
13. మనస్సాక్షి చేసే ముఖ్య పని ఏది?
14. మానవ మనస్సాక్షి పనిచేయడానికి సమాచారం ఎవరి ద్వారా సేకరించుతాము?
15. మనస్సాక్షి సాక్ష్యాన్ని వివరించుము?
16. సంఘమును హింసించినప్పుడు, పౌలు మనస్సాక్షి దోషారోపణను ఎలా తప్పించుకో గలిగిందో వివరించుము?
17. దోషారోపణగల మనస్సాక్షికీ, బలహీన మనస్సాక్షికీ తగిన పరిష్కార మార్గాలు ఏవి?
18. మనపై మనం తీర్పుచేయటానికి "మానసిక కోర్టు" నిమిత్తం జీవ నియమం ఎందుకు మంచి సమాచారం అవుతుంది?
19. మనం గతంలో సాధించిన ఆత్మీయ పెరుగుదల మన యొక్క అనుదిన కార్యక్రమమైన పరిశుద్ధ పరచబడు విధానాన్ని అధికం చేస్తుందని రోమా. 5:3-5 ఎట్లు వివరిస్తుందో చూపించుము?
20. పరిశుద్ధపరచబడుట అనేది క్రైస్తవుని జీవితంలో తటస్థమైనదికాక శక్తివంతమైనది ఎందుకో వివరించుము?
21. మన పాఠానికి సంబంధించి, 1 కొరింథీ 3:11లో ఏ విషయం ప్రస్తావించబడింది?
22. దేవుని రాజ్యంలోని అన్ని వర్గాలవారికి జీవ నియమం వర్తిస్తుందని ఎందువలన మనం నిర్ధారించగలం?
23. క్రైస్తవుడు నిన్నటికి సాధించిన ఆత్మీయ పెరుగుదల యొక్క విలువ ఈనాటి కార్యక్రమమైన పరిశుద్ధపరచబడుటలో ఎలా ఉంటుంది?
24. దేవుని యొక్క ఆజ్ఞలు మరియు మనం సాధించే జీవపు అభివృద్ధికీ మధ్యగల సంబంధమేమి?
25. దేవుని ఆజ్ఞలను పాటించుచు, జీవ నియమాన్ని మనకు అన్వయించు కుంటున్నామని ఎట్లు చెప్పగలం?